

25న చలో కలెక్టరేట్ : ఫ్యాప్టో

శ్రీకాకుళం అర్బన్ : పాత పెన్షన్ స్కీమ్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 25వ తేదీన చలో కలెక్టరేట్ చేపడుతున్నట్లు ఫ్యాప్టో జిల్లా చైర్మన్ మజ్జి మదన్మోహన్, సెక్రటరీ జనరల్ కె.అప్పలరాజు ఒక ప్రకటనలో తెలిపారు. పాత పెన్షన్ కోసం దశల వారీ ఉద్యమం చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఈనెల 22వ తేదీన నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరు, 23న సాయంత్రం పాత తాలూకా కేంద్రాల్లో నిరసన ప్రదర్శనలు చేపట్టనున్నట్లు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం మొండిగా జిపిఎస్ అమలు కోసం సిద్ధపడుతోందని పేర్కొన్నారు. ఉపాధ్యాయ, ఉద్యోగులందరూ పాత పెన్షన్ విధానమే కావాలని నినదిస్తున్నా లెక్క చేయకుండా, అందుకు భిన్నంగా జిపిఎస్‌ను రుద్దేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి కేబినెట్ ఆమోదించిందని తెలిపారు. నిరసన కార్యక్రమాలను జిపిఎస్‌ను వ్యతిరేకించే అన్ని ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలు మద్దతును ప్రకటించి ఉద్యమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

స్టీల్‌ప్లాంట్ ఉంటేనే ఉత్తరాంధ్ర అభివృద్ధి

- విశాఖ ఉక్కు ప్రయివేటీకరణతో ప్రజలకు నష్టం
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం
- జిల్లాకు చేరుకున్న ఉక్కు రక్షణ బైక్ యాత్ర
- అడుగడుగునా ఘన స్వాగతం



పొందూరు : బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి, ఆమదాలవలస, పొందూరు

విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రభుత్వరంగంలో ఉంటేనే ఉత్తరాంధ్ర అభివృద్ధి సాధ్యమని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం అన్నారు. విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం సిపిఎం చేపట్టిన ఉక్కు రక్షణ బైక్ యాత్ర గురువారం జిల్లాలోకి ప్రవేశించింది. ఈ సందర్భంగా ఆమదాలవలసలోని ఇందిరాగాంధీ కూడలి వద్ద నిర్వహించిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. విశాఖలో స్టీల్‌ప్లాంట్ ఏర్పాటైన తర్వాత జిల్లాలోని చాలామందికి ఉపాధి లభించిందని, కొంతమేర వలసలు తగ్గాయయని చెప్పారు. లక్ష మందికి ఉపాధి కల్పిస్తున్న ఏకైక పరిశ్రమ విశాఖ ఉక్కు అని తెలిపారు. 32 మంది బలిదానాలతో పోరాడి సాధించుకున్న పరిశ్రమ అని గుర్తుచేశారు. పరిశ్రమలో పెట్టుబడిగా ఉన్న రూ.ఐదు లక్షల కోట్లు ప్రజలదేనన్నారు. ప్రజల ఆస్తిని మోడీ సర్కారు ప్రయివేటుపరం చేయాలని చూస్తోందని విమర్శించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను అమ్మేస్తున్నా రాష్ట్రంలోని వైసిపి, టిడిపి, జనసేన ఎందుకు ప్రశ్నించడం లేదని అడిగారు. ఉత్తరాంధ్రలో 34 మంది ఎమ్మెల్యేలు, ఎంపీలు ఉన్నా విశాఖ ఉక్కు ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా మాట్లాడడం లేదని చెప్పారు. దేశంలోని ప్రభుత్వరంగ సంస్థలైన ఎల్ఐసి, రైల్వేలు ఇలా ఒక్కొక్కటినీ అంబానీ, అదానీకి కట్టబెడుతున్నారని తెలిపారు. శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అనేక అంశాలపై శాసనసభలో చర్చిస్తున్నా, విశాఖ ఉక్కు కోసం మాట్లాడం లేదని విమర్శించారు. విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం సిపిఎం సాగిస్తున్న పోరుకు ప్రజలంతా అండగా నిలబడాలని పిలుపునిచ్చారు.

సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.జగన్ మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్ ద్వారా 7.3 మిలియన్ల ఉక్కు ఉత్పత్తి చేస్తూ 32 వేల మందికి ఉద్యోగావకాశాలు కల్పించిందని చెప్పారు. అదే ప్రయివేట్ రంగంలోని పోస్కోలో 40 మిలియన్ల ఉత్పత్తి చేస్తూ కేవలం నాలుగు వేల మందికే ఉద్యోగాలు ఇచ్చిందని చెప్పారు. ఉక్కు పరిశ్రమ ప్రభుత్వం రంగంలోనే ఉంటేనే ప్రజలకు, ఉత్తరాంధ్రకు మేలు చేకూరుతుందని చెప్పారు. ప్రభుత్వరంగ సంస్థలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు.



ఆమదాలవలస : మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు లోకనాథం

టిడిపి సంఘీభావం

సిపిఎం చేపట్టిన బైక్ యాత్రకు టిడిపి సంఘీభావం తెలిపింది. బైక్ యాత్ర ఎచ్చెర్ల చేరుకున్న సందర్భంగా స్థానిక వెంకటేశ్వర విద్యాసంస్థల వద్ద టిడిపి జిల్లా మాజీ అధ్యక్షులు చౌదరి బాబ్జీ కార్యకర్తలతో కలిసి వచ్చి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌ను ఎందరో ప్రాణ త్యాగాలు చేసి పోరాడి సాధించుకున్నామని చెప్పారు. పరిశ్రమ ద్వారా జిల్లాకు చెందిన అనేక వేల మంది ఉద్యోగాలు చేస్తున్నారని చెప్పారు. పరిశ్రమ ప్రయివేటుపరం కాకుండా అడ్డుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కు ప్రయివేటీకరణ ఆపాలని, లేకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

బైక్ యాత్రకు ఘన స్వాగతం

విశాఖ ఉక్కు పరిరక్షణకు సిపిఎం చేపట్టిన బైక్ యాత్రకు జిల్లాలో అడుగడుగునా ఘన స్వాగతం లభించింది. తొలుత పొందూరు చేరుకున్న యాత్రకు సిపిఎం, ప్రజా, కార్మిక సంఘాల నాయకులు స్వాగతం పలికారు. అనంతరం స్థానిక వ్యవసాయ మార్కెట్ కార్యాలయం వద్ద ఉన్న బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. అక్కడ నుంచి బయలుదేరి ఎచ్చెర్ల మండలం చిలకపాలెం చేరుకున్నారు. చిలకపాలెం గ్రామస్తులు, నారాయణపురం రైతులు స్వాగతం పలికారు. అనంతరం ఎచ్చెర్ల మీదుగా ఆమదాలవలస చేరుకున్నారు. ఆమదాలవలస ఇందిరాగాంధీ కూడలికి చేరుకున్న యాత్రకు డప్పు వాయిద్యాలు, నృత్యాలతో స్వాగతం పలికారు. యాత్రలో పాల్గొన్న వారిపై పూలు చల్లారు.

పలు సంఘాల సంఘీభావం

బైక్ యాత్రకు పలు ప్రజా, కార్మిక, విద్యార్థి, ఉపాధ్యాయ సంఘాల నాయకులు సంఘీభావం ప్రకటించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు భవిరి కృష్ణమూర్తి, గంగరాపు సింహాచలం, సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి సిహెచ్.అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు, ఉపాధ్యక్షులు కె.నాగమణి, జన విజ్ఞాన వేదిక జిల్లా గౌరవాధ్యక్షులు బొడ్డేపల్లి జనార్ధనరావు, నాయకులు పంచాది లతాదేవి, కూన వెంకటరావు, ఎన్.వి రమణ, ఎస్.ప్రసాద్, టి.తిరుపతిరావు, తదితరులు పాల్గొన్నారు.



ప్రచార యాత్రను జెండా ఊపి ప్రారంభిస్తున్న రవీంద్ర

విద్యారంగ పరిరక్షణకు ఉద్యమం

- ఉపాధ్యాయుల సమస్యలపై అలుపెరుగని పోరాటం
- యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఎస్.ఎస్ ప్రసాద్
- స్వర్ణోత్సవాల ప్రచారయాత్ర ప్రారంభం

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం, సోంపేట, పలాస, టెక్కలి

ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు ఉద్యమించాలని యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఎస్.ఎస్ ప్రసాద్ పిలుపునిచ్చారు. యుటిఎఫ్ స్వర్ణోత్సవాలను పురస్కరించుకుని ఇచ్ఛాపురం నుంచి విజయవాడ వరకు చేపట్టిన ప్రచార యాత్రను యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి చౌదరి రవీంద్ర ఇచ్ఛాపురంలో గురువారం ప్రారంభించారు. యుటిఎఫ్ పతాకాన్ని పూర్వ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేపల్లి మోహనరావు ఆవిష్కరించారు. యాత్ర తొలిరోజు సోంపేట, హరిపురం, పలాస, టెక్కలి, నరసన్నపేట మీదుగా శ్రీకాకుళం వరకు సాగింది. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ 1974లో ఆవిర్భవించిన యుటిఎఫ్ ఉపాధ్యాయుల సమస్యలపై స్పందిస్తూ అధ్యయనం, అధ్యాపనం, సామాజిక స్పృహ లక్ష్యాలుగా పనిచేస్తోందన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలపై పోరాటాలు

ఎమర్జెన్సీని సైతం ఎదిరించి ఉపాధ్యాయుల హక్కులు, సంక్షేమం కోసం నిలబడిందన్నారు. ఉపాధ్యాయుల హక్కుల కోసమే కాక వారి బాధ్యతలను కూడా గుర్తుచేస్తూ, సమస్యల పరిష్కారంలో తనదైన ముద్ర వేస్తోందన్నారు. విద్యారంగ వికాసం, ఉపాధ్యాయుల సంక్షేమం కోసం ఎన్నో స్వతంత్ర ఉద్యమాలు, ఎన్నో ఐక్య ఉద్యమాలను చేపట్టిందని చెప్పారు. రీ గ్రూపింగ్ స్కేల్స్, ఆటోమేటిక్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్, ఎయిడెడ్ టీచర్ల డైరెక్ట్ పేమెంట్, మున్సిపల్ టీచర్లకు 010 పద్దు ద్వారా జీతాలు, డిడిఒ పవర్స్ సాధన, అప్రెంటిస్ విధానం రద్దు, బదిలీల కౌన్సెలింగ్ వంటి పోరాటాల్లో అగ్రభాగాన నిలిచిందన్నారు. ఉపాధ్యాయ సమస్యలు పరిష్కారంలో అగ్రభాగాన ఉండడమే కాదు, ప్రజలకు ఎలాంటి సమస్యలు వచ్చినా వారికి ఆర్థిక, హార్థిక సాయం అందించిన ఏకైన సంఘం యుటిఎఫ్ అని అన్నారు. జాతీయ విద్యా విధానం రద్దు, పాత పెన్షన్ సాధన, విద్యారంగ సంస్కరణలకు వ్యతిరేకంగా కార్యక్రమాలు రూపొందించుకుని పోరాటాలు చేస్తున్నామన్నారు.

జిపిఎస్‌తో నష్టం

వైసిపి ప్రభుత్వం తీసుకొస్తున్న నూతన విద్యా విధానాలు ప్రభుత్వ విద్యకు తీవ్ర నష్టదాయకంగా ఉన్నాయన్నారు. జగన్మోహన్‌రెడ్డి అధికారంలో వచ్చిన నాలుగేళ్ల అనంతరం జిపిఎస్ పేరుతో ఉద్యోగులకు నష్టం చేకూర్చే మరో పెన్షన్ విధానం తెచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. జగన్మోహన్‌రెడ్డి ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోతే వచ్చే ఎన్నికల్లో ఉపాధ్యాయులు గట్టిగా బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. యాత్రలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.అప్పారావు, ఎస్.కిషోర్ కుమార్, పూర్వ రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్, జిల్లా ఉపాధ్యక్షులు ఎల్.బాబూరావు, నాయకులు గుంట కేశవరావు, జి.కోదండరావు, ఎం.వాగ్దేవి, రెడ్డి మోహనరావు తదితరులు పాల్గొన్నారు.



లక్కుపురంలో చేరిన వరద నీరు

ముంచెత్తిన వరద నీరు

- పొంగిన చెరువులు, ఓనిగెడ్డ
- జలమయమైన లక్కుపురం
- ఆందోళనలో గ్రామస్తులు

ప్రజాశక్తి - బూర్జ

రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు ఓనిగెడ్డతో పాటు మూడు చెరువులు పొంగిపొర్లడంతో మండలంలోని లక్కుపురం గ్రామం జలమయమైంది. గెడ్డ, చెరువుల నీరు లోతట్టు ప్రాంతమైన లక్కుపురాన్ని ముంచెత్తడంతో ఇళ్లలోకి నీరు చేరింది. దీంతో గ్రామస్తులు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. గ్రామం మొత్తం వరదనీరు చుట్టుముట్టడంతో ఎటు వెళ్లాలో కూడా తెలియని పరిస్థితి నెలకొందని గ్రామస్తులు చెప్తున్నారు. వరదనీరు బయటకు వెళ్లే అవకాశం కూడా లేకుండా పోయింది. చెరువు నీరు తగ్గితేనే గ్రామంలోని నీరు బయటకు వెళ్తుంది. వరద నీరు ముంచెత్తినా అధికారులు ఇంతవరకు తమ గ్రామం వైపు కన్నెత్తి చూడలేదని గ్రామస్తుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ దయనీయ పరిస్థితిని అర్థం చేసుకుని అవసరమైన సహాయాన్ని అందించాలని కోరుతున్నారు.

సనాతన ధర్మంలో చెడుని నిర్మూలించాల్సిందే

చర్చాగోష్టిలో వక్తలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

సనాతన ధర్మంలో చెడుని నిర్మూలించాల్సిందేనని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. నగరంలోని అంబేద్కర్ విజ్ఞాన మందిర్‌లో గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం, సాహితీ స్రవంతి ఆధ్వర్యాన 'సనాతన ధర్మం - గురజాడ ఆలోచన' అన్న అంశంపై గురువారం చర్చాగోష్టి నిర్వహించారు. సనాతన ధర్మం డెంగీ, కలరా వంటిదని, దాన్ని అరికట్టాలని తమిళనాడు మంత్రి ఉదయనిధి స్టాలిన్ చేసిన వ్యాఖ్యలను ఏకీభవించి సంపూర్ణ సంఘీభావం తెలిపారు. మణిపూర్ మారణహోమాన్ని, అక్కడ స్త్రీలపై జరుగుతున్న దాడులను, అత్యాచారాలను ఖండించడానికి నోరు రాని ప్రధాని నరేంద్ర మోడీ సనాతన ధర్మంపై దాడిని ఖండించాలని సంఘ్ పరివార్‌శక్తలకు పిలుపునివ్వడం సిగ్గుచేటు అన్నారు. అంటరానితనం, కుల వివక్ష, బాల్యవివాహాలు, నిరక్షరాస్యత, దురాచారాలను, మూఢవిశ్వాసాలు, మహిళలపై అణచివేత, సతీసహగమనాన్ని నిర్మూలించాలనేవి జన సామాన్యం అంగీకరించే విషయాలన్నారు. ఈ చెడు గుణాలన్నీ సనాతన ధర్మంలో పొదుగుకున్నవే అయినప్పుడు సనాతన ధర్మంలో చెడును నిర్మూలించాలని కోరడం తప్పు ఎలా అవుతుందని ప్రశ్నించారు. బి.ఆర్ అంబేద్కర్ ఆధ్వర్యాన విరచితమైన రాజ్యాంగ పరిషత్‌తో ఆమోదించబడిన భారత రాజ్యంగం సనాతన ధర్మానికి, అది సాగించిన అన్నిరకాల అణచివేతలు, దురాచారాలు, దౌర్జన్యాలకు విరుగుడుగా రూపొందినవేనన్నారు. మనువాదులు రాజ్యాంగానికి విఘాతం కలిగిస్తూ సనాతన ధర్మం పేరిట, మనువాదం పేరిట, పీడిత ప్రజలపైన దళిత, గిరిజన, మైనార్టీలు, మహిళలపైన సాగిస్తున్న విద్వేషపు దాడిని ఖండించారు. రాజ్యాంగాన్ని పరిరక్షించే శక్తులకు మద్దతుగా నిలుస్తున్నట్టు వెల్లడించారు. మహాకవి, ఆధునిక కవితా పితామహుడు గురజాడ మానవత్వం, ప్రేమ, కులమతాలకు అతీతంగా ప్రజలందరి ఐక్యత, శాస్త్ర విజ్ఞాన ఔన్నత్యం, శ్రమైక జీవన సౌందర్యం, మహిళా విముక్తి కోసమే సాహిత్య సృజనలో ఆధునిక ఒరవడి, సంస్కరణ సృష్టించిన మహనీయుడన్నారు. కవిశేఖరుని 161వ జయంతి సందర్భంగా ఆ సంస్కర్త ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తుందన్నారు. చర్చాగోష్టిలో గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం అధ్యక్షులు వి.జి.కె మూర్తి, బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు పి.చంద్రపతిరావు, సాహితీ స్రవంతి ప్రతినిధి కె.శ్రీనివాసు, రచయిత చింతాడ రామారావు, దళిత సంఘాల నాయకులు కంఠ వేణు, ఎస్.కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం అధ్యక్షులు వి.జి.కె మూర్తి

ఎంబిబిఎస్ కౌన్సెలింగ్‌ను రద్దు చేయాలి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్, టెక్కలి



వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

రాష్ట్రంలో వైద్య విద్యకు సంబంధించి ఎంబిబిఎస్ సీట్ల కేటాయింపులో రెండో విడత కౌన్సెలింగ్‌లో అవకతవకలు చోటుచేసుకున్నాయని, వాటిని వెంటనే రద్దు చేసి రీ కౌన్సెలింగ్ నిర్వహించాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు బొడ్డేపల్లి సత్యవతి డిమాండ్ చేశారు. ఈమేరకు కలెక్టరేట్‌లో ఇన్‌ఛార్జి కలెక్టర్ ఎం.నవీన్‌ను గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 54 వేల ర్యాంకు వచ్చిన అభ్యర్థులకు రిజర్వేషన్ కేటగిరీలో, 80 వేల పైన ర్యాంకు వచ్చిన అభ్యర్థులకు ఓపెన్ కేటగిరీలో సీట్లు కేటాయించారన్నారు. వైద్య విశ్వ విద్యాలయం పరిధిలో ఎంబిబిఎస్ సీట్లు పొందడానికి అర్హత కలిగిన బిసి, ఎస్‌సి, ఎస్‌టి, మైనారిటీ అభ్యర్థులకు ఓపెన్ కాంపిటేషన్‌లో కేటాయించకుండా రిజర్వేషన్ కేటగిరీల్లో సీట్లు కేటాయించడం వల్ల రిజర్వేషన్ సీట్లు పొందాల్సిన వారికి అన్యాయం జరిగిందని వివరించారు. రిజర్వేషన్ గల అభ్యర్థులు సుమారు 80 సీట్లు కోల్పోయారని చెప్పారు. సుప్రీంకోర్టు నిబంధనల మేరకు మొదట ఓపెన్ కేటగిరీ సీట్లు కేవలం ప్రతిభ ఆధారంగా భర్తీ చేయాలన్నారు. 4వ ర్యాంకు పొందిన బిసి అభ్యర్థులకు రిజర్వేషన్ కేటగిరీలో సీట్లు కేటాయించి 62 వేల ర్యాంకు పొందిన అభ్యర్థులను ఓపెన్ కేటగిరీలో ఏవిధంగా కేటాయిస్తారని ప్రశ్నించారు. 2020లో హైకోర్టు సూచన మేరకు రాష్ట్ర ప్రభుత్వం నియమించిన హై లెవల్ కమిటీ ఇచ్చిన నివేదికను అనుసరించి జిఒ నంబరు 151ను జారీ చేసిందని గుర్తు చేశారు. వన్ టైం ఆల్ ఆప్షన్స్ అనే నిబంధన దీనివల్ల అమల్లోకి వచ్చిందని, ఒకసారి అభ్యర్థులు పెట్టిన ఆప్షన్స్ ఎవరు మార్చడానికి అధికారం లేదన్నారు. నిబంధనలకు విరుద్ధంగా రెండో విడత ఎంబిబిఎస్ అడ్మిషన్లు జరిగాయని, వాటిని తక్షణమే రద్దు చేసి నష్టపోయిన రిజర్వేషన్ అభ్యర్థులకు న్యాయం చేయాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో కాంగ్రెస్ నాయకులు దేశ్ళ గోవింద మల్లిబాబు, లఖినేన నారాయణరావు, పైడి నాగభూషణరావు, రెల్ల సురేష్ కె.వి.ఎల్.ఎస్ ఈశ్వరి తదితరులున్నారు.

ఎంబిబిఎస్ రెండో విడత కౌన్సెలింగ్‌ను రద్దు చేయాలని టెక్కలి సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద కాంగ్రెస్ నాయకులు ఆందోళన చేపట్టారు. అనంతరం సబ్ కలెక్టర్ నూరుల్ కమర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పేడాడ పరమేశ్వరరావు, నాయకులు కోత మధుసూదనరావు, చింతాడ దిలీప్, టి.కవిత తదితరులు పాల్గొన్నారు.



సోంపేట తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న సిపిఎస్ఇఎ నాయకులు

జిపిఎస్ వద్దే వద్దు

ప్రజాశక్తి - సోంపేట, కొత్తూరు

జిపిఎస్‌ను రాష్ట్ర కేబినెట్ ఆమోదించడాన్ని నిరసిస్తూ సోంపేట, కొత్తూరు తహశీల్దార్ కార్యాలయాల వద్ద ఎపి సిపిఎస్ఇఎ ఆధ్వర్యాన గురువారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆ సంఘ జిల్లా అధ్యక్షులు టి.సూర్యారావు, సోంపేట మండల అధ్యక్షులు తలగాన చంద్రశేఖర్ మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు జిపిఎస్‌ను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నా పట్టించుకోకుండా రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించడం సమంజసం కాదన్నారు. జిపిఎస్ వద్దు, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలంటూ నినాదాలు చేశారు. అనంతరం తహశీల్దార్లకు వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో పిఆర్‌టియు రాష్ట్ర నాయకులు శరత్‌బాబు, రమేష్ పాణిగ్రాహి, వేణుగోపాల్, మాధవరావు, దాలిబందు, యుటిఎఫ్, ఎపిటిఎఫ్ నాయకులు పాల్గొన్నారు.



కొత్తూరు తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు

స్పీకర్ పదవికి తమ్మినేని అనర్హుడు

టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్

ప్రజాశక్తి - ఆమదాలవలస



సమావేశంలో మాట్లాడుతున్న కూన రవికుమార్

శాసనసభ్యులకు సమన్యాయం చేయలేని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం ఆ పదవికి అనర్హుడు అని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ విమర్శించారు. మాజీ ముఖ్యమంత్రి, టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు అరెస్టును నిరసిస్తూ పట్టణంలోని టిడిపి కార్యాలయం వద్ద టిఎన్‌టియుసి ఆధ్వర్యాన కార్మికులు గురువారం నిర్వహించిన నేను సైతం బాబు కోసం రిలే నిరాహార దీక్షా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 14 ఏళ్ల పాటు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబుకు రాజమండ్రి సెంట్రల్ జైల్లో దోమతెర, వేడినీళ్లు వంటి కనీస సదుపాయాలు కల్పించకుండా రాక్షసానందం పొందుతున్న సైకో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అని ధ్వజమెత్తారు. ఇటీవలే రాజమండ్రి సెంట్రల్ జైల్లో ఆదినారాయణ అనే వ్యక్తి డెంగీతో మృతి చెందాడని, అక్కడి పరిస్థితిని ఈ సంఘటన తేటతెల్లం చేస్తోందన్నారు. పలు కార్యక్రమాల ద్వారా ప్రజల్లోకి చంద్రబాబు నాయుడు వెళ్తుండడంతో అనూహ్య స్పందన రావడం చూసి సైకో ముఖ్యమంత్రికి చెమటలు పట్టడంతోనే అక్రమ అరెస్టుకు పూనుకున్నారని దుయ్యబట్టారు. జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చాక పన్నుల మోత మోగించి పేద, మధ్యతరగతి ప్రజల వెన్ను విరిచారని విమర్శించారు. చంద్రబాబు నాయుడు, లోకేష్‌ను జైలులో పెట్టి తప్పుడు కేసులు బనాయించి తెలుగుదేశం పార్టీని కనుమరుగు చేసి వైసిపిని మళ్లీ అధికారంలోకి తీసుకురావాలని కలలు కంటున్నారని ధ్వజమెత్తారు. వైసిపి శవం మీద పుట్టిన పార్టీ అని, తెలుగు వారి ఆత్మగౌరవం కోసం పుట్టిన పార్టీ తెలుగుదేశం అని అన్నారు. సమ్మెలు, ర్యాలీలను నిషేధించి కార్మికుల కష్టాలు చెప్పుకోవడానికి వీల్లేకుండా నియంతలా పరిపాలన కొనసాగిస్తున్న జగన్ రెడ్డికి ఇంటికెళ్లే సమయం ఆసన్నమైందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి కూన ప్రమీల, జిల్లా ఉపాధ్యక్షులు పి.ఎం.జె బాబు, టిఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు జి.నారాయణరావు, టిడిపి మండల అధ్యక్షుడు నూకరాజు, మొదలవలస రమేష్, తమ్మినేని విద్యాసాగర్, ఎన్.జ్యోతీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


కోటబొమ్మాళి : ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తున్న రాఘవేంద్ర మీనా

ముగిసిన హిందీ భాషా దినోత్సవం

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

విద్యార్థులకు ఇంగ్లీష్ ఎంత అవసరమో... హిందీ కూడా అంతే అసరమని, ఈ రెండు భాషాలు నేర్చుకున్నవారు దేశంలో ఎక్కడైనా ఉద్యోగులు చేసుకోవచ్చునని ట్రైనీ కలెక్టర్ రాఘవేంద్ర మీనా అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో గురువారం నిర్వహించిన హిందీ భాషా దినోత్సవం ముగింపులో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా వివిధ ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులు నిర్వహించిన హిందీ ఎగ్జిబిషన్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ కె. ఫణీంద్రకుమార్, సర్పంచ్ కాళ్ల సంజీవరావు, మండల పరిషత్ ఉపాధ్యక్షులు బోయిన నాగేశ్వరరావు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి బోయిన గోవిందరాజులు, ఎంఇఒలు ఎస్.అప్పలరాజు, ఎల్.వి.ప్రతాప్ పాల్గొన్నారు.

హిందీ పుస్తకాల పంపిణీ

ఇచ్ఛాపురం : హిందీ పక్షోత్సవాలు కార్యక్రమంలో భాగంగా స్థానిక రైల్వేస్టేషన్ పరిధిలో ప్రయాణికులకు కథలు, నీతి పద్యాలు, సులభంగా హిందీ నేర్చుకునే పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో హిందూ ఉపాధ్యాయుడు రాంబాబు, పద్మజ పాల్గొన్నారు.


పలాస : ప్రచారం చేస్తున్న ఐద్వా నాయకులు

'నారీభేరి'ని విజయవంతం చేయాలి

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

మహిళలపై జరుగుతున్న హత్యలు, హత్యాచారాలను వ్యతిరేకిస్తూ అక్టోబరు 5న ఢిల్లీలో మహిళ నారీభేరి' నిర్వహిస్తున్నామని, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఐద్వా జిల్లా నాయకులు శ్రీదేవి పాణిగ్రహి పిలుపునిచ్చారు. మండలంలోని నగరంపల్లిలో మహిళతో గురువారం సమావేశం ఏర్పాటు చేసి పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళా రేజర్లను లైంగింకంగా వేధించిన బ్రిజ్ భూషణ్‌పై కేసు నమోదు చేయడానికి పోరాటం చేయాల్సి వచ్చిందన్నారు. సనాతన ధర్మం పేరుతో బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ పాత సాంప్రదాయాలు తిరగదొడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళా రిజర్వేషన్ 33 శాతం వచ్చే ఎన్నికల ఎత్తుగడని అన్నారు. కార్యక్రమంలో బి.సుగుణవతి, ఎన్.ఈశ్వరమ్మ, నారాయణి బి.లక్ష్మి, ఎస్.సరోజనమ్మ, ఎస్.ప్రభావతి, రాజు, లక్ష్మి, పారమ్మ, సావిత్రి పాల్గొన్నారు.

పలాస : ఢిల్లీలో జరగనున్న నారీ భేరి కార్యక్రమం జయప్రదం చేయాలని పిలుపునిస్తూ ఐద్వా నాయకులు పలాస-కాశీబుగ్గలో కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఐద్వా నాయకులు ఎన్.ఢిల్లీశ్వరి, జె.భాగ్యలక్ష్మి, రమణమ్మ, పద్మ, శాంతి, భారతి, లత పాల్గొన్నారు.

ఘనంగా 'గురజాడ' జయంతి


శ్రీకాకుళం అర్బన్ : విగ్రహం వద్ద నివాళ్లర్పిస్తున్న మూర్తి, తదితరులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరంలోని శాంతినగర్ కాలనీలో ఉన్న గాంధీ మందిరంలో సంఘ సంస్కర్త గురజాడ అప్పారావు 161వ జయంతి వేడుకలు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా విగ్రహదాతలు డాక్టర్ జామి భీమశంకర్ తోపాటు అతిథి వి.జి.కె.మూర్తి, గాంధీ మందిర ప్రతినిధులు గురజాడ విగ్రహానికి పూలమాలలు వేశారు. అనంతరం వారు మాట్లాడుతూ నేటికీ గురజాడ రచనల ప్రభావం సమాజంపై ఉందన్నారు. సనాతన సంప్రదాయాల పేరుతో స్త్రీ జాతిని అణగదొక్కుతున్న రోజుల్లో మహిళల హక్కుల కోసం తన రచనల ద్వారా నినదించిన ధీరుడు గురజాడ అని కొనియాడారు. గురజాడ రచనలలో కన్యాశుల్కం, ముత్యాలసరాలు, పుత్తిడిబొమ్మ పూర్ణమ్మ, సాంఘిక దురాచారాలపై సమాజాన్ని జాగృతం చేసిన సంస్కర్త గురజాడ అన్నారు. గురజాడ గొప్పతనాన్ని అవధాన పండితుడు పైడి హరనాథరావు గేయం ద్వారా ఆలపించారు. కార్యక్రమంలో గాంధీ మందిర కమిటీ ప్రతినిధులు నటుకుల మోహన్, మెట్ట అనంతం భట్లు, నక్క శంకరరావు, గుత్తు చిన్నారావు, పొన్నాడ రవికుమార్, కొమ్ముర‌మణమూర్తి, గోపీ, తర్లాడ అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

నగరంలోని గొంటి వీధిలో ఉన్న విద్యాధరి డిగ్రీ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా గురజాడ అధ్యయన వేదిక కన్వీనర్, కళాశాల వ్యవస్థాపకులు డాక్టర్ జామి భీమశంకరరావు, రచయిత, ఉపాధ్యాయులు పత్తి సుమతి, భాగ్యలక్ష్మి, వరలక్ష్మి, వి.టి.నాయుడు, సంపత్, ఎర్రన్నాయుడు పాల్గొన్నారు.


టెక్కలి : చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న అధ్యాపకులు

జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి.కుమార్‌రాజు, లైబ్రేరియన్ ఎస్.వి.రమణమూర్తి, కె.చిరంజీవులు, పి.వరలక్ష్మి, యు.కళ్యాణి, ప్రత్యూష, పి.భానుమతి, పి.రామమోహన్, గణేష్, సరోజిని పాల్గొన్నారు.

లావేరు : దేశమంటే మట్టికాదోయ్... దేశమంటే మనుషులోయ్ అంటూ వెలుగెత్తిన చాటిన గురజాడ అప్పారావు 161వ జయంతిని గురువారం లావేరు శాఖాగ్రంథాలయంలో నిర్వహించారు. తొలిత ఆయన చిత్రపటానికి గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు పూలమాలవేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఆయన జీవిత చరిత్రపై నిర్వహించిన వ్యాసరచన పోటీలో పి.సంపత్ ప్రథమ, కె.ప్రియాంక ద్వితీయ స్థానాల్లో నిలిచారు. వారికి గ్రంథాలయం తరుపున బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు ఎ.గడ్డియ్య, సత్యసాయి స్కూల్ కరస్పాండెంట్ రాజు, ప్రిన్సిపాల్ కళ్యాణి, ఉపాధ్యాయులు కె.పార్వతి, గుహునాకుమారి, ఎల్.సులోచన పాల్గొన్నారు.

టెక్కలి : సమాజానికి వినియోగంలోకి వచ్చే రచనలు సామాజిక దృక్పథం కలిగి ఉండాలని టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబురు గోవిందమ్మ పిలుపునిచ్చారు. గురజాడ అప్పారావు జయంతి సందర్భంగా గురువారం కళాశాలలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు బేపల సతీష్‌కుమార్, అంపోలు రామారావు, వై.లీలాపద్మజ, వి.తిరుమలరావు, లూక్‌పాల్ పాల్గొన్నారు.

కవిటి : అభ్యుదయ కవితా పితామహుడు గురజాడ అప్పారావు అని ఎంఇఒ ధనుంజయ మజ్జి అన్నారు. గురజాడ 161వ జయంతి ఉత్సవాలు మండలంలోని ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కవిటి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల వద్ద


చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న గ్రంథాలయ సిబ్బంది

గురజాడ విగ్రహానికి ఎం.ఇ.ఒ. పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఉన్నత, ఒడియా ఉన్నత, ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు బెందాళం మల్లేశ్వరరావు, ప్రసాద్ పట్నాయక్, బెందాళం వరలక్ష్మి, ఆంగ్ల పాఠశాల ప్రిన్సిపాల్ బిందుమాధవి, ఆర్ష విజ్ఞాన భారతి ప్రిన్సిపాల్ ఎం. అనిల్ తదితరులు పాల్గొన్నారు.

నౌపడ : నౌపడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురజాడ వెంకట అప్పారావు జయంతి వేడుకలను హెచ్‌ఎం ఎం. భాను ప్రకాష్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా గురజాడ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళలర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గోపాలకృష్ణ, మల్లేశ్వరరావు, సింహాచలం పాల్గొన్నారు.

సోంపేట: ప్రముఖ తెలుగు కవి, సంఘసంస్కర్త గురజాడ అప్పారావు జయంతి వేడుకలను గురువారం బారువలో ఘనంగా నిర్వహించారు. గురజాడ అప్పారావు జయంతి పురస్కరించుకొని స్థానిక యువజన సంఘ సభ్యులు గురజాడ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో యువజన సంఘ సభ్యులు జి. రవణ, పిట్ట పోలయ్య, వై రవి, కె వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.


నౌడప : మాట్లాడుతున్న హెచ్‌ఎం భానుప్రకాష్

పారిశుధ్య కార్మికుల నిరసన

శ్రీకాకుళం అర్బన్ : మున్సిపాల్టీల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 21 నుండి 27 వరకు నల్ల బ్యాడ్జీలతో విధులు నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి) పిలుపు మేరకు గురువారం నగర కార్పోరేషన్ సంస్థ వద్ద నిరసన చేపట్టారు. కార్యక్రమంలో ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ. షన్ముఖరావు మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి దశల వారీ పారిశుధ్య కార్మికులు ఆందోళన చేస్తున్నట్టు చెప్పారు. ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ కార్మికులకు పర్మినెంట్ చేసి కనీస వేతనాలు ఇవ్వాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ నెల 22న నగర కార్పోరేషన్ సంస్థ కార్యాలయం ఎదుట ధర్నా, 24న మానవహారం, 25న కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షులు కొమర భాస్కరరావు, ముఖ్య సలహాదారు చిక్కాల గోవిందరావు, జిల్లా అధ్యక్షులు మాడుగుల రాఘవ, ప్రధాన కార్యదర్శి కళ్యాణి, అప్పలరాజు పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న పారిశుధ్య కార్మికులు

15 మందికి సదరం పరీక్షలు

శ్రీకాకుళం అర్బన్ : విజయనగరం జిల్లా గరివిడికి చెందిన 15 మంది చెవిటి, మూగ వారికి స్థానిక జిల్లా సర్వనాస్పత్రిలో గురువారం వైద్యులు సదరం వైద్య పరీక్షలు నిర్వహించారు. చెవిటి, మూగ వైకల్యం ఉన్న వారికి సదరం ధ్రువీకరణకు ఆస్పత్రికి చేరుకున్నారు. గరివిడి లయన్స్‌క్లబ్ ప్రతినిధుల అభ్యర్థన మేరకు లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ అధ్యక్షులు పొన్నాడ రవికుమార్, మెంటార్ నటుకుల మోహన్ ఆస్పత్రికి చేరుకున్నారు. వారికి బోజన సదుపాయంతో పాటు పరీక్షలకు తోడ్పాటు అందించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్, సెక్రెటరీ రామ్‌గోపాల్, సభ్యులు కామేష్ పాల్గొన్నారు.


నియామకపత్రం అందుకుంటున్న సత్యప్రసాద్

డిఐపిఆర్ పిఆర్ఒగా సత్యప్రసాద్

శ్రీకాకుళం : జిల్లా సమాచార పౌరసంబంధాల శాఖ వారి కార్యాలయంలో పిఆర్ఒగా ఎస్.వి.సత్యప్రసాద్ నియమితులయ్యారు. ఆశాఖ ఇఇ చెన్నకేశవరావు, డిపిఆర్ఒ బాలమాన్ సింగ్ సమక్షంలో గురువారం ఉదయం ఆయన బాధ్యతలు స్వీకరించారు. సత్యప్రసాద్ ప్రస్తుతం మాజీ డిప్యూటీ సీఎం, నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ వద్ద పిఆర్ఒగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఆయన గతంలో వార్త దినపత్రికకు 14 ఏళ్ల పాటు స్టాఫ్ రిపోర్టర్, బ్యూరో ఇన్‌ఛార్జిగా, విశాలాంధ్ర దినపత్రికకు బ్యూరో చీఫ్‌గా మూడేళ్ల పాటు పనిచేశారు. ఈయన నియామకంపై పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


విచారణ చేస్తున్న ఎంపిడిఒ హరిహరరావు

తాడివలస కార్యదర్శిపై విచారణ

పొందూరు: మండలంలోని తాడివలస పంచాయతీ కార్యదర్శి వెంకటరావు ఇంటి పన్నులు వసూలు పంచాయతీ ఖాతాకు జమచేయకుండా అవకతవకలకు పాల్పడ్డారని గ్రామానికి చెందిన లక్ష్మణరావు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎంపిడిఒ సీపాన హరిహరరావు గురువారం విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఫిర్యాదు దారుడు, గ్రామస్తుల సమక్షంలో విచారణ చేపట్టారు. గ్రామంలో పలు విడతలుగా సుమారు రూ.56 వేలు వసూలు చేసి పంచాయతీ ఖాతాకు జమచేశానని కార్యదర్శి తెలపగా, పంచాయతీ బిల్లులు ఇవ్వకుండా ఇంటి పన్నులు వసూలు చేశారని పలువురు ఫిర్యాదు చేశారు. అలాగే సమాచార హక్కు చట్టం కింద సమాచారం కోరినా ఇవ్వడం లేదని ఎంపిడిఒ దృష్టికి గ్రామస్తులు తీసుకొచ్చారు. దానిని ఇప్పిస్తానని ఎంపిడిఒ గ్రామస్తులకు హామీనిచ్చారు. దీంతో పలు విషయాలపై కార్యదర్శి, గ్రామస్తుల మధ్య వాగ్వావాదం చోటుచేసుకుంది. అనంతరం ఎంపిడిఒ మాట్లాడుతూ విచారణకు సంబంధించిన నివేదికను ఉన్నతాదికారులకు సమర్పించనున్నట్లు పేర్కొన్నారు.


ప్లకార్డులు ప్రదర్శిస్తున్న విద్యార్థినులు

మహిళల ప్రగతికి దారి

సోంపేట: నారీమణులు ప్రగతిపథంలో పయనించడానికి మహిళా బిల్లు ఓ మార్గం అని జాగృతి స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు రామ్ బుడ్డి గణపతి పిలుపునిచ్చారు. స్థానిక కొర్లాంలోని బాలకష్ణ జూనియర్ కళాశాలలో గురువారం 'నారీభేరీ ప్రగతికి దారి' అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టడం హర్షణీయమన్నారు. ఇకపై అన్ని రంగాల్లో రాణించిన విధంగానే రాజకీయాల్లో సైతం తమదైన ముద్ర వేస్తారన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ హరికష్ణ, సిబ్బందితోపాటు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

వికేంద్రీకరణతోనే అభివృద్ధి


మంజు

టెక్కలి రూరల్: రాష్ట్ర వికేంద్రికరణతో అన్ని ప్రాంతాలూ అభివృద్ధి చెందుతాయని, అందుకే జగన్ ప్రభుత్వం ఈ కీలక నిర్ణయం తీసుకుంటుందని, దీనిపై హర్షతిరేకాలుతో స్వాగతిస్తున్నామని వైసిపి మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు చింతాడ మంజు ఒక ప్రకటనలో అన్నారు. ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్‌రెడ్డి ఉత్తరాంధ్ర వెనుకబాటు తనం చూసి విశాఖపట్నం పరిపాలన రాజధాని చేయడం ద్వారా ఈ ప్రాంత ప్రజలు తరుపున కృతజ్ఞతలు తెలిపారు. ఇప్పటికైనా టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు స్వాగతించాలని, లేదంటే ఉత్తరాంధ్ర ప్రజల ఆగ్రహానికి గురవుతారని హెచ్చరించారు.


ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

స్వచ్ఛతా లీగ్‌పై అవగాహనా సదస్సు

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం పురపాలక సంఘం పరిధిలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఇండియన్ స్వచ్ఛతా లీగ్ 2.0 కార్యక్రమంలో మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉపేంద్ర కుమార్ ఆధ్వర్యాన గురువారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు విశ్వనాథ్ మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థి తమ ఇంటి తడి చెత్త, పొడి చెత్త, హానికరమైన చెత్తలుగా వేరు చేసి మున్సిపల్ వాహనాలకు రోజూ విధిగా అందించాలని పిలుపునిచ్చారు. అనంతరం విద్యార్థులతో సామూహికంగా ప్రతిజ్ఞలు చేశారు. మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉపేంద్రకుమార్, ఉపాధ్యాయులు, సచివాలయ వార్డు శానిటేషన్, ఎన్విరాన్మెంట్ కార్యదర్శులు పాల్గొన్నారు.

మిత్ర పురుగులతో చీడ పీడల నివారణ

ప్రజాశక్తి- బూర్జ

ఉద్యాన పంటలు పండించే రైతులు మిత్ర పురుగులను తోటల్లో విడుదల చేయడం వలన చీడపీడలను సమర్థవంతంగా నివారించవచ్చునని వైఎస్ఆర్ విజ్ఞాన విశ్వ విద్యాలయం ఉద్యాన పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎన్‌బివి చలపతిరావు తెలిపారు. గురువారం మండలంలోని దత్తత గ్రామమైన పాలవలసలో నిర్వహించిన మన గ్రామం, మన విశ్వవిద్యాలయం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులు తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులు, తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాసరాజు, చిన్నమ్మడు, మనోహర్ పాల్గొన్నారు.

ప్రాథమిక విద్యే భవిష్యత్‌కు నాంది

ప్రజాశక్తి- లావేరు

విద్యార్థుల భవిష్యత్ ప్రాథమిక పాఠశాల విద్యతోనే ప్రారంభమవుతుందని ఎచ్చెర్ల ఎంఇఒ కె.పున్నయ్య అన్నారు. యూత్ క్లబ్ బెజ్జిపురం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యాన ఇండియా లిటరసీ ప్రాజెక్టు బెంగుళూరు సహకారంతో స్కూల్ రెడీనెస్, బాలవికాస్ ప్రోగ్రాంను గురువారం నిర్వహించారు. ఇందులో భాగంగా శ్రీకాకుళం రూరల్, గార, ఎచ్చెర్ల మండలాల్లోని 1 నుంచి 2 తరగుతులకు బోధిస్తున్న 45 ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులకు కృత్యాధార బోధన పద్ధతులపై ఆటాపాటలతో అభియన గేయాలపై గురువారం శిక్షణ ఇచ్చారు. విజయనగరం జిల్లా చీపురుపల్లి శోధన సంస్థ రిసోర్స్‌పర్సన్ శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా యూత్‌క్లబ్ బెజ్జిపురం సంస్థ డైరెక్టర్ ఎం.ప్రసాదరావు మాట్లాడుతూ విద్యార్థులకు కృత్యాధర బోధన, అభినయ గేయాల బోధన చేయడం వల్ల విద్యను బాగా అభ్యసిస్తారని


మాట్లాడుతున్న ఎంఇఒ పున్నయ్య

అన్నారు. సంస్థ కోశాధికారి జి.అప్పలనాయుడు మాట్లాడుతూ విద్యార్థుల నమోదు పెంచడంలోనే పాఠశాల భవిష్యత్ ఆధారపడి ఉందని అన్నారు. లెర్నింగ్ కో-ఆర్డినేటర్ టి.కరుణాకరరావు మాట్లాడుతూ ప్రతి పాఠశాలలోనూ వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ పి.మాధవి అసిస్టెంట్ కో-ఆర్డినేటర్ వై. శంకరరావు, కమ్యూనిటీ ఆర్గనైజర్స్ ఎ.రమణమూర్తి, ఆర్.కల్పన, యు.మెహెర్‌వాణి, పి.అప్పలనాయుడు, బి.సంతోషి పాల్గొన్నారు.

అరెస్టు తర్వాత ఆధారాలు సేకరించడమా?


మాట్లాడుతున్న అప్పలసూర్యనారాయణ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

చంద్రబాబుపై పెట్టిన అక్రమ కేసులన్నీ నిరాధారమైనవని, అందువల్లే సిఐడి అధికారులు ఉద్దేశపూర్వకంగా ఆయనను అరెస్టు చేసిన తర్వాత ఆధారాలు వెతుకుతున్నారని మాజీ మంత్రి గుండ అప్పల సూర్యనారాయణ ఆరోపించారు. జిల్లా టిడిపి కార్యాలయంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. న్యాయస్థానంలో అక్రమ కేసుల్లో సిఐడి కస్టడీని కోరడం ఆధారాలు సేకరించడానికే అని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. రికార్డు అవిడెన్స్ లేకుండా అరెస్టు చేయడం కక్షపూరిత చర్యగా భావిస్తున్నామన్నారు. కోర్టులో కాలయాపన చేస్తూ చంద్రబాబును బాదించాలన్న ఉద్దేశపూర్వక చర్యలను తాము ఖండిస్తున్నామని పేర్కొన్నారు. ఆర్థిక నేరారోపణ చేసినప్పుడు ఎక్కడ అవినీతి జరిగింది, ఎంతమేరకు జరిగింది, ఇందులో డబ్బులు ఎక్కడ చేతులు మారాయన్న అంశాలు సిఐడి చెప్పలేక పోతోందన్నారు. దీన్ని బట్టి చంద్రబాబుపై పెట్టిన కేసులన్నీ కక్షసాధింపు ధోరణితోనే పెట్టారని పేర్కొన్నారు.

ఒరియా పుస్తకాలు పంపిణీ

ప్రజావక్తి- ఇచ్ఛాపురం

ఒరియా పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలని నియోజకవర్గ ఉత్కళ సమ్మిళని గంజాంశాఖ ప్రధాన కార్యదర్శి దీనబంధు పల్లవి, కోశాధికారి భీమసేన్ మహాపాత్రో అన్నారు. ఇచ్ఛాపురం మున్సిపాలిటీ ఒడియా ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఒడియా లింగ్విస్టిక్ మైనారిటీ సంఘం అధ్యక్షుడు సత్యనారాయణపాడి అధ్యక్షతన "మధు బర్ణబోధ" పుస్తకాలను గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మధు బర్ణబోధ పుస్తకాలు ప్రాథమిక స్థాయి, లెర్నర్ విద్యార్థులకు ఉపయోగపడతాయని అన్నారు. ఈ సందర్భంగా


ఒరియా పుస్తకాలను పంపిణీ చేస్తున్న ప్రతినిధులు

ఒడియా డి.ఐ.దుర్గాప్రసాద్‌చౌదరి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ఒడియా విద్యార్థులకు గుణాత్మక విద్య అందించాలన్నారు. విద్యా కేలండర్ ప్రాప్తికి సిలబస్ పూర్తి చేయాలని ఉపాధ్యాయులను కోరారు. కార్యక్రమంలో ఎపి, ఒడియా టీచర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బృందావన్ దోళాయి, ఉత్కళ సమ్మిళని సుపర్‌వైజర్ విద్యాధర బెహరా, ఉత్కళ సమ్మిళని విద్యావాలంటీర్లు పాల్గొన్నారు.


పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ వరదరాజు

ముమ్మరంగా పారిశుధ్య పనులు

వజ్రపుకొత్తూరు : దేవునల్తాడలో పారిశుధ్య పనులు ముమ్మరంగా చేపడుతున్నారు. గురువారం సర్పంచ్ టి.వరదరాజు పర్యవేక్షణలో పారిశుధ్య కార్మికులు పనులు నిర్వహించారు. గ్రామంలోని కాలువల్లో పేరుకుపోయిన చెత్త చెదారం పూడికను బయటకు తీసి శుభ్రం చేశారు. వీధుల కూడలిలో చెత్తను తొలగించి బ్లీచింగ్ పౌడర్ చల్లి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా స్థానికులతో సర్పంచ్ మాట్లాడుతూ గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలను కోరారు. అపరిశుభ్రంగా ఉంటే అంటురోగాలు ప్రబలే ప్రమాదం ఉందన్నారు. ఆయనతో పాటు ఎంపిటిసి వెంకన్న, సచివాలయం సిబ్బంది ఉన్నారు.

సేవే లయన్స్ క్లబ్ 'శ్రీకాకుళం హర్షవల్లి' లక్ష్యం

శ్రీకాకుళం అర్బన్ : సేవే పరమావధిగా లయన్స్ క్లబ్ శ్రీకాకుళం హర్షవల్లి ఏర్పాటు చేయడం అభినందనీయమని, ఇదే నిజమైన లైనిజమని డిస్ట్రిక్ గవర్నర్ ఎ.గోపాలరావు అన్నారు. నగరంలోని అరసవల్లి రోడ్డులో ఉన్న సన్‌రైజ్ హోటల్‌లో బుధవారం రాత్రి లయన్స్ క్లబ్ శ్రీకాకుళం హర్షవల్లి నూతన క్లబ్ చార్టర్ అండ్ సంస్థాపన దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా డాక్టర్ గోపాలరావు పాల్గొని మాట్లాడుతూ లయన్స్‌క్లబ్‌లో చేరే సభ్యులు నిజాయితీ, నిబద్ధతతో పనిచేయాల్సి ఉంటుందన్నారు. 106 సంవత్సరాల క్రితం ఏర్పడిన లయన్స్‌క్లబ్ ప్రస్తుతం 214 దేశాల్లో 14 లక్షల 50 వేల మంది సభ్యులతో ప్రపంచంలోనే గొప్ప ఎన్‌జిఒ సంస్థగా కొనియాడబడుతోందని అన్నారు. మాజీ గవర్నర్ ఎం.ఉషారాజు మాట్లాడుతూ లయనిజంలోకి వారంతట వారు జాయిన్ అవ్వరని, ఎవరో ఒకరు ఆహ్వానించడం వల్లే చేరుతారని అన్నారు. క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు కె.ఎన్.ఎన్.వి.ప్రసాద్ (హారికాప్రసాద్) మాట్లాడుతూ తాను గతంలో లయన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్‌గా పనిచేశారని, అక్కడ అంతగా సేవ చేసే అవకాశం రాలేదన్నారు. అందుకే లయన్స్ క్లబ్ శ్రీకాకుళం హర్షవల్లి పేరిట క్లబ్‌ను ప్రారంభించామన్నారు. ఈ క్లబ్ ఏర్పాటుకు ఎన్నో సూచనలు, సలహాలు అందించిన ఉషారాజుకి కృతజ్ఞతలు తెలిపారు. క్లబ్ తొలి అధ్యక్షులుగా నియమితులైన కరణం శోభారాణి మాట్లాడుతూ లయన్స్‌క్లబ్ శ్రీకాకుళం హర్షవల్లి తొలి మహిళా అధ్యక్షులుగా తాను నియమితులు కావడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం క్లబ్ నూతన కార్యవర్గంతో గత డిస్ట్రిక్ గవర్నర్ ఉమామహేశ్వరరావు ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో రీజియన్ చైర్‌పర్సన్ తూముల శ్రీనివాసరావు, విశ్రాంత అదనపు జిల్లా వైద్యాధికారి చింతాడ కృష్ణమోహన్, రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ జగన్మోహనరావు, జామి భీమశంకర్, ఎసిబి సిఐ భాస్కరరావు, డాక్టర్ అన్నంనాయుడు, కోట పార్వతీశ్వరరావు (జెఎన్‌టి నాయుడు), జెమ్స్ కాలేజీ ఫౌండర్ డాక్టర్ సుధీర్, పలు స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.



మెమొంటోను అందుకుంటున్న హారికాప్రసాద్

నూతన కార్యవర్గం ఎంపిక

వ్యవస్థాపక అధ్యక్షులుగా కె.ఎన్.ఎన్.వి.ప్రసాద్, అధ్యక్షులుగా కరణం శోభారాణి, ఉపాధ్యక్షులుగా-1 వావిలాపల్లి జగన్నాథనాయుడు, ఉపాధ్యక్షులుగా-2 గెడ్డాపు శ్రీకృష్ణప్రసాద్, సెక్రటరీగా రౌతు శ్రీనివాసరావు, ట్రెజరర్‌గా తర్లాడ అప్పల చంద్రశేఖరనాయుడు, మెంబర్ షిప్ కమిటీ చైర్మన్‌గా కె.పార్వతీశ్వరరావు, క్లబ్ ఎల్‌సిఐఎఫ్ కో-ఆర్డినేటర్‌గా డాక్టర్ ఎం.సత్యస్వరూప్, క్లబ్ సర్వీస్ చైర్‌పర్సన్‌గా పొలిశెట్టి మధుబాబు, క్లబ్ మార్కెటింగ్ కమ్యూనికేషన్స్ చైర్‌పర్సన్‌గా ఎస్.బ్రహ్మాజీ, క్లబ్ అడ్మినిస్ట్రేటర్‌గా జి.బాలగాంధీ, క్లబ్ డైరెక్టర్‌గా డాక్టర్ సిహెచ్.కృష్ణమోహన్‌లు ఎన్నికయ్యారు.

మహిళా బిల్లులో బిసిలను చేర్చకపోవడం అన్యాయం


నిరసన తెలుపుతున్న బిసి సంఘం నాయకులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన మహిళా బిల్లులో బిసి, ఓబిసిలను చేర్చక పోవడం అన్యామని బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు పిట్టా చంద్రపతిరావు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం నగరంలోని మహాత్మా జ్యోతిరావు పూలే పార్క్ వద్ద నల్లరిబ్బన్లు ధరించి నిరసన తెలిపారు. ముందుగా పూలే విగ్రహానికి పూలమాలలు వేసి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మహిళా బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిందని, అందులో కులాల వారీ వాటా విభజన జరగాలన్నారు. దేశంలో అత్యధిక జనాభా ఉన్న బిసిలకు మహిళా బిల్లులో విభజన జరగాలన్నారు. కార్యక్రమంలో పిట్టా భాగ్యచంద్ర, కలగ జగదీశ్ యాదవ్, కర్రీ రంగాజీ దేవ్, అడపాక రాంబాబు, తిప్పాన గాంధీ పాల్గొన్నారు.

కార్మికులకు జాకెట్ల పంపిణీ

పలాస : పలాస మున్సిపల్ కార్యాలయంలో పారిశుధ్య కార్మికులకు ప్రత్యేక గుర్తింపు ఉండే జాకెట్లను గురువారం మున్సిపల్ చైర్మన్ బల్ల గిరి బాబు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డులో పారిశుధ్య నిర్వహణ చేస్తున్న స్వీపర్‌కు ఆప్రాన్స్ పంపిణీ చేశామన్నారు. మున్సిపల్ కమిషనర్ టి.నాగేంద్ర కుమార్, శానిటరీ ఇన్స్పెక్టర్, సచివాలయ సెక్రటరీ పురపాలక సంఘ రూట్ మేనేజర్లు పాల్గొన్నారు.


జాకెట్లను పంపిణీ చేస్తున్న చైర్మన్ గిరిబాబు

తానా కవయిత్రి సమ్మేళనానికి మీనాక్షి

ప్రజాశక్తి- పొందూరు


మీనాక్షి

అమెరికాలోని తానా కవయిత్రి సమ్మేళనానికి పొందూరు మండలం గోకర్ణపల్లికి చెందిన కవయిత్రి రోణంకి మీనాక్షి ఎంపికయ్యారు. ఈ మేరకు మీనాక్షికి తానా నిర్వాహకుల నుంచి ఆహ్వానం అందింది. ఈ నెల 24న ఆదివారం సాయంత్రం 5 నుంచి 7.30 గంటల మధ్య జరిగే ఈ సమ్మేళనానికి జిల్లా నుంచి ఈమె ఒక్కరు మాత్రమే ఎంపికయ్యారు. ఆ రోజు వర్చువల్ విధానంలో సమ్మేళనంలో ఆమె పాల్గొంటారు. ఉన్నత విద్యావంతురాలైన మీనాక్షి హరికథా బాగవతరుగాను ఉన్నారు. ప్రస్తుతం ఈమె స్థానిక సిస్టం డిగ్రీ కళాశాలలో అధ్యాపకులుగా పనిచేస్తున్నారు. ఈమె ఎంపిక కావడంపై కళాశాల కరస్పాండెంట్ మొదలవలస మోహనరావు, అధ్యాపకులు హర్షం వ్యక్తం చేశారు.


పోస్టుకార్డు ఉద్యమంలో పాల్గొన్న గొండు శంకర్

బాబుకు మద్దతుగా పోస్టుకార్డు ఉద్యమం

శ్రీకాకుళం అర్బన్ : రాజమండ్రి సెంట్రల్ జైల్లో ఉన్న మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు మద్దతుగా టిడిపి నాయకులు, జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు గొండు శంకర్ పార్టీ ఆదేశాల మేరకు నిరసన కార్యక్రమాలు చేపడుతున్నారు. అందులో భాగంగా గురువారం పోస్టు కార్డు ఉద్యమాన్ని ప్రారంభించారు. ఇన్నాళ్లు మీరు మాకు అండగా ఉన్నారు... ఇప్పుడు మేము మీకు అండగా ఉంటాం' అని లేఖలో రాసి చంద్రబాబు నాయుడు, స్నేహ బ్లాక్, సెంట్రల్ జైలు, రాజమహేంద్రవరం, తూర్పుగోదావరి జిల్లా, పిన్ కోడ్-533101 అన్న చిరునామాకు ఐదు వేల మంది పోస్టు కార్డులు రాయించి పోస్టు చేశారు.

గణనాథుని లడ్డూకు భలే గిరాకీ


లడ్డూతో గాయత్రి మహిళా స్వయం సహాయక సంఘం సభ్యులు

ప్రజాశక్తి- కవిటి

కవిటి మండలంలోని పలు గ్రామాల్లో వినాయక నిమజ్జనం ఉత్సవాలు సందడిగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా నిర్వహిస్తున్న వేలం పాటలో లంబోధరుని లడ్డు అధిక ధర పలుకుతూ ఔరా అనిపిస్తోంది. ఈ మేరకు కవిటి మండలం కొత్తపుట్టుగ బంగారు వీధిలో నిర్వహించిన లడ్డు వేలంలో పాల్గొన్న విశ్రాంత ఆర్మీ జవాన్ నర్తు చంద్రయ్య రూ.71 వేలకు కైవసం చేసుకోగా,. కపాసుకుద్దిలోని మహా గణపయ్య లడ్డును స్థానిక గాయత్రి మహిళా స్వయం సహాయక సంఘం రూ.63 వేలకు చేజిక్కించుకుంది. కొత్తపుట్టుగ తూర్పు వీధిలో మొదటి లడ్డు నర్తు జగ్గయ్య (దీనయ్య) రూ.46 వేలకు, రెండో లడ్డు నర్తు నాగేష్ రూ.20 వేలకు, కొమ్ముపుట్టుగలో గోపాల్ రూ.30 వేలకు, ప్రగడపుట్టుగ మండపం వీధిలో లడ్డును బదకల జగ్గారావు రూ.25,700లకు దక్కించుకున్నారు. కపాసుకుద్దిలో సంగారు కృష్ణమూర్తి, జయలక్ష్మి దంపతులు 37,701లకు లడ్డు కైవసం చేసుకున్నారు.

విదేశీ జీడిపిక్కల దిగుమతులు ఆపాలి


మాట్లాడుతున్న మాధవరావు

ప్రజాశక్తి- పలాస

స్వదేశీ జీడి రైతాంగాన్ని దెబ్బతీస్తున్న విదేశీ జీడిపిక్కల దిగుమతులు ఆపాలని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి వంకల మాధవరావు ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. బుధవారం పలాస న్యూడెమోక్రసీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దశాబ్దాలుగా ఉద్దానంలో జీడి రైతులు దగా పడుతున్నారన్నారు. జీడిపంటే ప్రధాన జీవనాధారంగా ఉన్న రైతాంగానికి గిట్టుబాటు ధర రావడం లేదని, ప్రభుత్వం జీడి రైతాంగం పట్ల ఒక పాలసీ అనేది రూపొందించకపోవడం దారుణమన్నారు. వ్యాపారులు దయాదాక్షిణ్యాల మీద వదిలేశారని, అందుకనే ప్రభుత్వం ఇప్పటికైనా స్వదేశీ పిక్కలను కొనుగోలు చేసి విదేశీ పిక్కల దిగుమతులు ఆపాలని డిమాండ్ చేశారు. కేరళ తరహాలో జీడి రైతాంగాన్ని ఆదుకోవాలని కోరారు. జీడి పండు ఆధారిత పరిశ్రమలను ప్రోత్సహించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో భారత కార్మిక సంఘాల సమాఖ్య ఐఎఫ్టియు జిల్లా కన్వీనర్ జుత్తు వీరాస్వామి, బైరి. కూర్మారావు, అరుణోదయ సాంస్కృతి సమాఖ్య జిల్లా కార్యదర్శి కె. సోమేశ్వరరావు, ఐఎఫ్టియు బంగ్లా కుమార్, సరస్వతి, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

వంద మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

పట్టణంలోని 80 అడుగుల రోడ్డులో ఆరోగ్య సంరక్షణ కోసం నడక సాగిస్తున్న వారికి ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు క్యాంప్ కార్యాలయం ఆవరణలో గురువారం ఉచిత ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరంలో సుమారు వంద మంది హాజరై ఆరోగ్య తనిఖీలు చేయించుకున్నారు. అధిక బరువు, పోషకాహార లోపం, చక్కెర వ్యాధి, రక్త పోటు వంటి రోగాలకు ఉచిత పరీక్షలు నిర్వహించారు. 12 వారాల్లో ఆరోగ్యాన్ని మెరుగు పరుచుకునేందుకు తగిన సూచనలు అందించారు.


బీమా సొమ్మును అందజేస్తున్న సర్పంచ్ సంజీవరావు

వైఎస్ఆర్ బీమా అందజేత

కోటబొమ్మాళి : మేజరు పంచాయతీ పరిధి బంజీరుపేట కు చెందిన శిమ్మ గోవిందరావు ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. దీంతో ఆయనకు వైఎస్ఆర్ బీమా వర్తించడంతో తక్షణ సాయంగా మృతుడి నామినీకి సర్పంచ్ కాళ్ల సంజీవరావు రూ.పది వేలు గురువారం అందజేశారు. అనంతరం మృతుడి కుటుంబాన్ని పరామర్శించి ప్రభుత్వం తరుపున అందాల్సిన వాటిని త్వరితగతిన అందించేందుకు చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో అప్పన్న, పల్ల తవిటి రాజు, వెల్ఫేర్ మాధవి, బొంతల కృష్ణారావు పాల్గొన్నారు.

అన్న సమారాధన

ఆమదాలవలస : మండలంలోని కొర్లకోటలో వినాయక మండపం వద్ద భారీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యుడు సనపల అప్పలనాయుడు మాట్లాడుతూ ఏటా వినాయక చవితి మహోత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు సనపల ఢిల్లేశ్వరరావు, అన్నెపు భాస్కరరావు, అన్నెపు కిశోర్, పైడి భాస్కరరావు, అన్నెపు కిరణ్, పేడాడ క్రిలాజ్, చిగురుపల్లి రామ్మోహనరావు పాల్గొన్నారు.

మెళియాపుట్టి : మండలంలో పెద్దలక్ష్మీపురం, జాడుపల్లి, చాపర, మర్రిపాడు, దీనబంధుపురం తదితర గ్రామాల్లో వినాయక నిమజ్జన కార్యక్రమంలో భాగంగా గురువారం అన్నదానం చేశారు.

విజేతలకు బహుమతులు అందజేత

ఇచ్ఛాపురం: మున్సిపాలిటీలోని రత్తకన్న ప్రైమరీ స్కూల్‌లో గురువారం వినాయక విగ్రహం ప్రతిష్ఠ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సాంస్కృతిక, క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఇందులో విజేతలకు ఆమె బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో కమిషనర్ రమేష్, కౌన్సిలర్లు ఆదిరెడ్డి, జగన్నాయకులు, భూదేవి, నీలాపు లక్ష్మి పాల్గొన్నారు.

సరితకు అభినందనలు

టెక్కలి రూరల్ : శ్రీకాకుళం కోడి రామ్మూర్తి స్టేడియంలో నిర్వహించిన అండర్-17 గ్రూప్ జిల్లాస్థాయి హాకీ పోటీల్లో ఆటల పోటీల్లో టెక్కలి బాలికోన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న వి.ఎం.సరిత రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైందని ప్రధానోపాధ్యాయులు ఎన్.శోభారాణి గురువారం తెలిపారు. సరితకు వ్యాయామ ఉపాధ్యాయులు డి.సూర్యకాంతం, పీడీ బి.ఆదిశేషు అభినందించారు.

ప్రజాదరణ చూసి ఓర్వలేక అక్రమ కేసులు

ప్రజాశక్తి- విలేకరుల యంత్రాంగం

రాష్ట్రంలో గడచిన నాలుగున్నరేళ్ల పాటు వైసిపి సాగించిన విధ్వంసం, కక్షపూరిత ధోరణి వల్ల ప్రజలు విసిగి వేశారి టిడిపి ప్రభుత్వం రాక కోసం ఎదురు చూస్తున్నారని, సభలు, యాత్రల్లో పెద్దఎత్తున ప్రజలు తరలిరావడాన్ని చూసి ఓర్వలేని జగన్మోహన్‌రెడ్డి చంద్రబాబుపై అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపించారని మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి ఆరోపించారు. జిల్లా టిడిపి కార్యాలయం వద్ద మత్స్యకార సాధికారిత కమిటీ ఆధ్వర్యాన చేపట్టిన రిలే నిరాహారదీక్షలో ఆమెతో పాటు మాజీ మంత్రి గుండ అప్పలసూర్యనారాయణ, మత్స్యకార జిల్లా సాధికార కమిటీ అధ్యక్షులు మైలపల్లి నర్సింగరావు, సంఘాల ప్రతినిధులు కొమర కమల, మైలపల్లి నర్సింహులు, సూర్యనారాయణ, భాస్కరరావు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి టిడిపి కార్యాలయం వద్ద చేపట్టిన


దీక్షలో పాల్గొన్న టిడిపి నాయకులు

నిరాహారదీక్షలో టిడిపి నాయకులు బోయిన రమేష్, బగాది శేషగిరి, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరివరప్రసాద్, వెలమల విజయలక్ష్మి, తర్ర రామకృష్ణ, గొండు లక్ష్మణరావు, దేవాది సింహాద్రి పాల్గొన్నారు.

నరసన్నపేట పట్టణంలో తెలుగు రైతు విభాగం ఆధ్వర్యాన నిర్వహించిన రిలే నిరాహారదీక్షకు మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి పాల్గొని సంఘీభావం తెలిపారు. దీక్షలో జల్లు చంద్రమౌళి, లుకలాపు రాంబాబు, సీనియర్ నాయకులు గొండు రామన్న పాల్గొన్నారు.


రికార్డులను పరిశీలిస్తున్న కుమార్‌రాజు

గ్రంథాలయం తనిఖీ

ప్రజాశక్తి- లావేరు

విద్యార్థులు గ్రంథాలయంలో ఎలా చదువుతున్నారో, ఏ పుస్తకాలు చదువుతున్నారో అని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి.కుమార్ రాజు అడిగి తెలుసుకున్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా గురువారం లావేరు శాఖాగ్రంథాలయాన్ని తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడారు. ప్రతి ఆదివారమూ చదవడం మాకిష్టం, పుస్తక ప్రదర్శన, ప్రతి మూడో శనివారం చిల్డ్రన్స్ క్లబ్ గ్రంథాలయాల్లో ఏర్పాటు చేస్తున్నామని, వీటికి మంచి స్పందన వస్తుందని అన్నారు. మీరందరూ ఈ శాఖాగ్రంథాలయానికి వచ్చి ఈ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం గ్రంథాలయానికి సంబంధించిన రికార్డులను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే గ్రంథాలయంలో ప్రతినెలా ధరావత్తుదారులను చేర్పించుటకు సిబ్బంది కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో గ్రంథాయలాధికారి మురపాక శ్రీనివాసరావు, గ్రంథాలయ సహాయకులు ఎ.గడ్డియ్య పాల్గొన్నారు.

ఆకట్టుకున్న వినాయకుడు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

పట్టణంలో నీలకంఠేశ్వరవీధిలో ఏర్పాటు చేసిన సత్యనారాయణ స్వామి విగ్రహం మాదిరి వినాయక విగ్రహం అందరకీ విశేషంగా ఆకర్షిస్తోంది. నాలుగు రోజులుగా ఈ వినాయక విగ్రహం చూడడానికి ప్రజలు తరలివస్తున్నారు.

కవిటి: మండలంలోని బల్లిపుట్టుగలో బాల వినాయక యూత్ ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన అనంత పద్మనాభస్వామి అవతారంలోని వినాయక విగ్రహం చూపరులను ఆకర్షిస్తోంది. భక్తులకు దర్శనమిచ్చి అలసి.. సొలసి ఉయాలపై ఊగేలా ఏర్పాటు చేసిన ఈ విగ్రహం పలువురి మన్ననలు అందుకుంటోంది.


ఆకట్టుకుంటున్న అనంత పద్మనాభ వినాయకుడు


అధికారులతో మాట్లాడుతున్న రామ్‌మనోహర్‌నాయుడు

లక్ష్మీనగర్ సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరపాలక సంస్థ పరిధిలో విలీన పంచాయతీల్లో ఉన్న అరసవల్లి, లక్ష్మీనగర్ సమస్యలను పరిష్కరించాలని వైసిపి నాయకులు ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు అధికారును కోరారు. గురువారం అధికారులతో కలిసి లక్ష్మీనగర్ ప్రాంతాన్ని సందర్శించారు. కాలనీలో పారిశుధ్య నిర్వహణ, రోడ్ల నిర్మాణం, డ్రైనేజీ, తాగునీటి సౌకర్యం వంటి సమస్యలను ప్రజల నుంచి తెలుసుకున్నారు. కొన్ని ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణం జరిగినప్పటికీ డ్రైనేజీ లేక మురుగునీరు ఖాళీ ప్రదేశాల్లో చేరి దోమలు వృద్ధి చెందుతున్నాయని అన్నారు. రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అమృత సాగర్ రూ.106 కోట్లతో మంజూరు చేయించారని, త్వరితగతిన పనులు చేపట్టాలని అధికారులను కోరారు. ఈయనతో పాటు కరంచంద్, గొలివి వెంకటరమణ, అప్పాయాదవ్, గంగు శారద, గాయత్రి, పద్మావతి పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ లక్ష్మణరావు

ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరి

పొందూరు : ప్రమాదాల నివారణకు వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్ఐ లక్ష్మణరావు పేర్కొన్నారు. పొందూరు పట్టణంలోని అంబేద్కర్ కూడలిలో గురువారం వాహన దారులకు రహదారి భద్రతా నియమాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్‌ను ధరించాలని, మైనర్లకు ద్విచక్రవాహనాలను తల్లిదండ్రులు ఇవ్వరాదని సూచించారు. మద్యం తాగి వాహనాలను నడిపితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈయనతో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి స్థల పరిశీలన

కవిటి : కవిటి మండలం రాజపురం గ్రామంలోని శ్రీరాముని ఆలయం సమీపంలో ఉన్న మూడు ఎకరాల ఖాళీ స్థలంలో శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం నిర్మాణం కోసం శ్రీకాకుళం టిటిడి ఇఒ లలితకుమారి గురువారం స్థల పరిశీలన చేసి, స్థానిక పెద్దలతో మాట్లాడారు. జెడ్పీ ఛైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు సహకారంతో ఎంపిటిసి సనపల కస్తూరావు, సనపల ఈశ్వరరావు, గ్రామ పెద్దలు ఇటీవల విశాఖపట్నంలో టిటిడి ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డిని కలిసి గ్రామంలో రామాలయం సమీపంలో ఉన్న 3 ఎకరాల ఖాళీ స్థలంలో శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం, కళ్యాణ మండపం, షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి టిటిడి నిధులు మంజూరు చేయాలని కోరారు. దీనిపై స్పందించిన టిటిడి అధికారులు గురువారం రాజపురం చేరుకుని పరిస్థితి సమీక్షించారు. అనంతరం టిటిడి ఇఒ లలితకుమారి మాట్లాడుతూ గ్రామంలో వెంకటేశ్వర స్వామి ఆలయం నిర్మించేందుకు అనుమతులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. టిటిడి అధికారి ప్రసాదరావు, సర్పంచ్ సనపల జానకరావు, ఎంపిటిసి ఎస్.కష్టారావు, సత్యనారాయణ పాడి, బి.హేమాచలం, ఎస్ ఈశ్వరరావు పాల్గొన్నారు.


గ్రామ పెద్దలతో మాట్లాడుతున్న టిటిడి ఇఒ లలితకుమారి


వినతిపత్రం అందజేస్తున్న పద్మావతి

ఆలయ పునర్నిర్మాణానికి నిధులు కేటాయించాలి

కవిటి : కవిటి మండలం బొరివంక గ్రామంలోని శ్రీ రామలింగేశ్వర ఆలయ పునర్నిర్మాణానికి ప్రభుత్వం నుంచి రూ.50 లక్షలు విడుదల చేయాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, దేవదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణని ఎపి కళింగ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మహిళా జోనల్ ఇంచార్జ్ బెందాళం పద్మావతి కోరారు. ఈ మేరకు రాష్ట్ర సచివాలయంలో తన చాంబర్లో మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తన వినతిపై ఉప ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించి ప్రభుత్వం నుంచి రూ.40 లక్షల మ్యాచింగ్ గ్రాంట్ కింద సిజిఎఫ్ నిధుల నుంచి విడుదల చేస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. ఇచ్ఛాపురం నియోజకవర్గ సమన్వయకర్త పిరియా సాయిరాజ్, స్థానిక సర్పంచ్ బెందాళం రాంప్రసాద్, ఎంపిటీసీ దుద్ది సతీష్, గ్రామ ప్రజల అభీష్టం మేరకు తాను ఉప ముఖ్యమంత్రిని కలిశానని, దానికి సానుకూలంగా స్పందించిన మంత్రికి పద్మావతి కృతజ్ఞతలు తెలిపారు.